ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## లవ్ జిహాద్ కేసుల్లో యావజ్జీవ ఖైదు విధించేలా నూతన చట్టం
హిమంత బిశ్వ శర్మ

2

సంపుటి: 2 | సంచిక: 116 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 5 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

## 2029లోనూ విపక్షానికే ఇండియా కూటమి పరిమితం: అమిత్ షా



న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): విపక్షాలు ఏం చేసినా 2029లో మళ్లీ ఎన్డీయే అధికారంలోకి వస్తుందని, మోదీ ప్రధాని అవుతారని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుచుకున్న స్థానాల కంటే బీజేపీకి ఈ ఎన్నికల్లో అధిక స్థానాలు లభించాయనే విషయం వారికి తెలియదని ..మిగతా 2లో

## బంగ్లాదేశ్‌లో ఆందోళనలు
32 మంది మృత్యువాత.. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించిన సర్కారు



న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): బంగ్లాదేశ్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సాయంత్రం 6 గంటల నుంచి దేశవ్యాప్తంగా కర్ఫ్యూ ప్రకటించింది. ఆదివారం జరిగిన హింసాత్మక ఘటనల్లో 32 మంది ప్రాణాలు వదిలారు. ప్రధాని ..మిగతా 2లో

# అమెరికాలో బిజీబిజీగా సీఎం రేవంత్




## పలు కంపెనీలతో ఒప్పందాలు

న్యూయార్క్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): అమెరికాలోని న్యూయార్క్‌లో సీఎం రేవంత్ బృందానికి ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. న్యూయార్క్‌లో జరగబోయే కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొనబోతున్నారు. 11రోజుల పర్యటనలో భాగంగా అమెరికాలోని పలు నగరాలు సహా దక్షిణ కొరియాలోని సియోల్‌ను సీఎం రేవంత్ రెడ్డి బృందం పర్యటించనుంది. ఆగస్టు 14 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. ఎనిమిది రోజులు అమెరికాలో, రెండు రోజులు దక్షిణ కొరియాలో రేవంత్ రెడ్డి అండ్ టీమ్ పర్యటించబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించనున్నారు. ఆదివారం మంత్రి శ్రీధర్ బాబు అమెరికా బయలుదేరివెళ్లగా ..మిగతా 2లో

## సీఎం రేవంత్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పిన కేటీఆర్
రాష్ట్రానికి పెట్టుబడులు తేవాలని ఆకాంక్ష
తెలంగాణ ఫస్ట్.. ఆ తర్వాతే రాజకీయాలంటూ ట్వీట్

2

## వచ్చే ఏడాది మార్చి నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలి
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): వచ్చే ఏడాది మార్చి కల్లా ఎట్టి పరిస్థితిలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సిందేనని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. సచివాలయంలో జెన్‌కో ఉన్నతాధికారులతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి యూనిట్ అక్టోబర్ 30.. ఐదో యూనిట్‌ను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంట్‌లో పనిచేసే కొద్దిమంది అధికారులు, సిబ్బంది జ్వరాలతో బాధపడుతున్నారని.. ఫలితంగా పనుల్లో కొంత జాప్యం జరుగుతున్నట్లు సమావేశంలో అధికారులు వివరించారు. సిబ్బంది సంక్షేమమే ప్రధానమని.. వెంటనే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, కార్మికుల భద్రతకు ఎన్ని నిధులు ఖర్చు చేసేందుకైనా వెనుకాడొద్దని సూచించారు. అధికారులు, కార్మికులు స్థానికంగా నివసించేందుకు వెంటనే క్వార్టర్ల నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆదేశించారు. స్థానికంగా నివసించేందుకు ఇబ్బందులు ఉన్నందున క్వార్టర్లు నిర్మించే వరకు మిర్యాలగూడ, దామరచర్ల నుంచి సిబ్బందిని తరలించేందుకు ప్రత్యేక బస్సులు అధికారులు సిబ్బందికి ఏర్పాటు చేయాలని చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నుంచి బూడిద తరలింపునకు తాళ్ల వీరప్పగూడెం, దామరచర్లకు నాలుగు వరుసల బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రగతిపై ..మిగతా 2లో



## హైదరాబాద్‌లో వరుసగా రోడ్డు ప్రమాదాలు
ఒకేరోజు ఏడుగురు వ్యక్తులు మృతి
ఇందులో ఇద్దరు ఏపీకి చెందిన ఇద్దరు యువకులు
కొత్తగూడా ఫ్లైఓవర్ ప్రమాదం

హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ రోడ్లు రక్తమోడాయి. ఒకే రోజు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఏపీకి చెందిన ఇద్దరు యువకులతో సహా ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. నగరంలోనే.. కేబుల్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకుల ప్రాణాలు పోయాయి. బ్రిడ్జ్‌పై అతివేగంగా వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొట్టటంతో.. బ్రిడ్జిపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరోవైపు.. రాయదుర్గంలో కారు డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు యువకులు మృతి చెందారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు ..మిగతా 2లో

## ఈ నెల చివరి కల్లా రూ.24 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



మంత్రి పొంగులేటి హామీ

హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): ప్రభుత్వ భూమిని పేదలకు పంచి, వీలైనంత త్వరలో పేదల సొంతింటి కల నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఖమ్మం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే చేసి చూపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదని మంత్రి పొంగులేటి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేల కొండపల్లి మండలంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ..మిగతా 2లో

## 'ఫోర్త్ సిటీ' పేరుతో కాంగ్రెస్ భూదందా
కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'ఫోర్త్ సిటీ' వెనుక పెద్ద ఎత్తున భూదందా జరుగుతుందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు ..మిగతా 2లో



## త్వరలో కొత్త రేషన్ కార్డులు
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): ప్రజావాణి ద్వారా పరిష్కరించడానికి అవకాశం ఉన్న ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం సచివాలయంలో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజావాణి పనితీరుపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విధానాల్లో ఏవైనా మార్పులు చేయాలని ప్రజావాణి అధికారులు భావిస్తే వాటిని రాతపూర్వకంగా ప్రభుత్వానికి నివేదించాలని పేర్కొన్నారు. ఇందులో సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులు, అవి పరిష్కరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, వివిధ ప్రభుత్వ శాఖల ..మిగతా 2లో

# అమెరికాలో బిజీబిజీగా సీఎం రేవంత్



మొదటి పేజీ తరువాయి...

సోమవారం మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి యూఎస్ వెళ్లబోతున్నారు. వీరిద్దరు సీఎం బృందంతో కలుస్తారు. ఈ పర్యటనలో పలు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పెట్టుబడుల కోసం రేవంత్‌రెడ్డి విదేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి.

**న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటన**

ఈ నెల తొమ్మిది వరకు న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటించి పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం రేవంత్ భేటీ అవుతారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతోనూ సమావేశమవుతారు. ఈ నెల 5న న్యూయార్క్‌లోని కాగ్నిజెంట్, ఆర్సీఎం, టిబిసి, కార్నింగ్, జోయిటస్ సహా పలు సంస్థల ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ అవుతారు. 6న పెప్సికో, హెచ్‌సిఏ ఉన్నతాధికారులతో సమావేశమైన తరువాత న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ వెళతారు.

**ఐటీ కంపెనీల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొననున్న సీఎం రేవంత్**

వాషింగ్టన్‌లో ఐటీ సేవల సంస్థలు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. ఇక్కడ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమవుతారు. అనంతరం డల్లాస్‌కు వెళ్తారు. ఈ నెల 7న ఛార్లెస్ స్క్వాబ్ హెడ్, మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను సందర్శిస్తారు. 8న కాలిఫోర్నియాలో ట్రినెట్ సీఈఓ, ఆరమ్, ఆమ్జెన్, రెనెసాస్, అమాట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. సెలెక్ట్ టెక్ యూనికార్న్స్ ప్రతినిధులతో మాట్లాడతారు. సెమీ కండక్టర్ రంగానికి చెందిన పలు సంస్థలతో రౌండ్ టేబుల్ భేటీలోనూ సీఎం రేవంత్ పాల్గొంటారు. ఈ నెల 9న గూగుల్ సీనియర్ ప్రతినిధులతో సిఎం రేవంత్ భేటీ ఉండనుంది. స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సెంటర్‌ను సీఎం రేవంత్ సందర్శిస్తారు. అమెజాన్ వైస్ ప్రెసిడెంట్, జెడ్ స్కేలర్ సీఈఓ, ఎనోవిక్స్, మోనార్క్ ట్రాక్టర్స్, థెర్మోఫిషర్ సైంటిఫిక్ ప్రతినిధులను సీఎం రేవంత్ కలుస్తారు. ఈ నెల 10న అమెరికా నుంచి బయలుదేరి 11న దక్షిణ కొరియా సియోల్‌కు చేరుకుంటారు. 12న సియోల్‌లో యూయూ ఫార్మా, కొరియన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ, ఎల్‌ఎస్ హోల్డింగ్స్, హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులు సహా ఆ దేశ ఉన్నతాధికారులతో భేటీ అవుతారు. 13న హాన్ రివర్ ప్రాజెక్టుపై డిప్యూటీ మేయర్ జూ యంగ్ టాయ్తోతో సీఎం భేటీ ఉంటుంది. 14న రేవంత్ బృందం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతుంది. దక్షిణ కొరియా పర్యటనలో సామ్‌సంగ్, ఎల్జీ సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరపనుంది.



# సీఎం రేవంత్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పిన కేటీఆర్

హైదరాబాద్, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులు తీసుకురావడం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు చేసుకోవడమే లక్ష్యంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 10 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలోని వివిధ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చలు జరుగనున్నాయి. శనివారం (ఆగస్టు 3) ఉదయం రేవంత్, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు బృందం అమెరికా పర్యటకు బయల్దేరగా.. న్యూయార్క్ ఎయిర్ పోర్టులో వారికి ఘన స్వాగతం లభించింది. రేవంత్ అమెరికా పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. పెట్టబడుల సాధన కోసం అమెరికా పర్యటనకు వెళ్లిన రేవంత్ బృందానికి కేటీఆర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం ఇతర దేశాల్లో ఉన్న ప్రముఖ కంపెనీ ప్రతినిధులతో పెంచుకున్న సంబంధాలు నేడు రాష్ట్రానికి మేలు చేకూరుస్తున్నాయని చెప్పారు. విరామం లేకుండా పట్టుదలతో తెలంగాణకు భారీ ఎత్తున వీదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని వెల్లడించారు. వాటి పునాదుల మీదే.. నేడు రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రానుండటం సంతోషకరమని చెప్పారు. 'మా అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించేందుకు మేం అధిక ప్రాధాన్యం ఇచ్చాం. టీఎస్ ఐపాస్ లో ప్రభుత్వ వినూత్నమైన విధానాలకు ఆకర్షితులై చాలా సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాయి. గత దశాబ్ద కాలంలో రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు వివిధ రంగాల్లో 24 లక్షలకు పైగా ప్రైవేట్ ఉద్యోగాలను మేం సృష్టించాం. ఏది ఏమైనా రాజకీయాలు పక్కన పెడితే.. నాకు మరియు బీఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడూ తెలంగాణ ఫస్ట్. ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రత్యక్ష పెట్టుబడులను తీసుకురావడంలో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మేం స్థాపించిన బలమైన పునాదిపై తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తారని హృదయపూర్వకంగా ఆశిస్తున్నా.. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# లవ్ జిహాద్ కేసుల్లో యావజ్జీవ ఖైదు విధించేలా నూతన చట్టం

## హిమంత బిశ్వ శర్మ

న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 (ప్రభాత ఉదయం): లవ్ జిహాద్ కేసుల్లో జీవిత ఖైదు విధించేలా తమ ప్రభుత్వం చట్టాన్ని తీసుకొస్తుందని అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. గువహటిలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లవ్ జిహాద్ గురించి తాము ఎన్నికల సందర్భంగా మాట్లాడామని, త్వరలో దీనిపై చట్టాన్ని తీసుకొస్తామని చెప్పారు. ఇలాంటి కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా చట్టంలో పొందుపరుస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నూతన నివాస విధానాన్ని తీసుకొస్తుందని, ఈ విధానం ప్రకారం అసోంలో జన్మించిన వారికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అర్హత ఉంటుందని చెప్పారు. ఎన్నికల హామీల ప్రకారం లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, వాటిలో స్థానిక యువతకే అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింల మధ్య భూ విక్రయాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఈ తరహా లావాదేవీలను ప్రభుత్వం నిరోధించకపోయినా వీటిపై ముందుకెళ్లే ముందు సీఎం అనుమతి తీసుకోవడం తప్పనిసరి చేసిందని హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు.

# వచ్చే ఏడాది మార్చి నాటికి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలి

మొదటి పేజీ తరువాయి...

వారంలోగా తనకు నివేదిక సమర్పించాలన్నారు. త్వరలో ప్లాంట్‌ను సందర్శించి.. అధికారులు, సిబ్బందితో భేటీ అవుతానని తెలిపారు. సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి రోనాల్డ్ రాస్, జెన్‌కో డైరెక్టర్లు అజయ్, సచ్చిదానందం, వైటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ సమ్మయ్య, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్, డిప్యూటీ స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండి ముషారఫ్, ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

# త్వరలో కొత్త రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి...

వారీగా వచ్చిన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం సందర్భంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్పందిస్తున్న తీరును అధికారులను విచారించారు. ఫిర్యాదు గారు తన సమస్య పరిష్కారం ఎంతవరకు వచ్చిందో తెలుసుకునేందుకు ఏ రకమైన వ్యవస్థ ప్రజావాణిలో ఉన్న అంశంపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ఫిర్యాదు మొదట దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఎస్ఎంఎస్ పంపిస్తామని, సమస్య పరిష్కారం అయిన తర్వాత చివరగా మరొక ఎస్ఎంఎస్ మొబైల్ కు పంపిస్తామని ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సమావేశంలో వివరించారు. ఫిర్యాదు పరిష్కారం ఏ దశకు చేరిందనే అంశం తెలుసుకునే వ్యవస్థ ప్రస్తుతం లేదని ఆ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణికి సంబంధించిన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్టు నోడల్ అధికారి దివ్య దేవరాజన్ సమావేశంలో వివరించగా.. రేషన్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. త్వరలో నిర్ణయం తీసుకొని కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. రేషన్ తీసుకునేందుకు, సంక్షేమ పథకాలు పొందేందుకు వేరువేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వంలో చర్చ జరుగుతుందని త్వరలోనే నిర్ణయం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొత్త పెన్షన్లను సైతం త్వరలో మంజూరు చేసే అవకాశం ఉందని చెప్పారు. మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ఇస్తే ప్రయోజనం లేదు వారికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది, అందుకు అవసరమైతే ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ డెస్క్ లను బలోపేతం చేసేలా చర్యలు చేపడితే సీఎంఆర్ఎఫ్ కు సంబంధించి ఫిర్యాదులు తగ్గిపోతాయని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. జీరో విద్యుత్ బిల్లు దరఖాస్తులు తీసుకునే మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని డిప్యూటీ సీఎం అధికారులకు తెలిపారు. ప్రజావాణి విభాగంలో పనిచేసేందుకు పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని నోడల్ అధికారి దివ్య కోరగా డిప్యూటీ సీఎం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 2029లోనూ విపక్షానికే ఇండియా కూటమి పరిమితం: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి...

ఎద్దేవా చేశారు. అస్థిరతను కోరుకుంటున్న ఈ నేతలు పదేపదే ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని ప్రచారం చేస్తున్నారని, తమ ప్రభుత్వం అయిదేండ్ల పదవీ కాలం పూర్తిచేయడంతో పాటు రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధించి తదుపరి ఎన్డీయే ప్రభుత్వం కొలువు తీరుతుందని పేర్కొన్నారు. చండీఘడ్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగించారు. 24 గంటల మంచినీటి సరఫరా ప్రాజెక్టును కేంద్ర హోంమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. విపక్ష ఇండియా కూటమి మరోసారి విపక్షంలో కూర్చునేందుకు సిద్ధపడాలని చెప్పారు. విపక్ష పాత్ర పోషించడం ఎలా అనేది వారు నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. విపక్షం ఏం చేసినా అధికారంలోకి రావడంజరిగేపని కాదని చెప్పారు.



# బంగ్లాదేశ్‌లో ఆందోళనలు

మొదటి పేజీ తరువాయి...

షేక్ హసీనా రాజీనామా చేయాలంటూ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఓ నివేదిక ప్రకారం.. ఫెనిలో జరిగిన హింసలో ఐదుగురు ప్రాణాలు వదిలారు. సిరాజ్‌గంజ్‌లో నలుగురు, మున్షిగంజ్‌లో ముగ్గురు, బోగురాలో ముగ్గురు, మగురాలో ముగ్గురు, భోలాలో ముగ్గురు, రంగ్‌పూర్‌లో ముగ్గురు, పబ్నాలో ఇద్దరు, సిల్హెట్‌లో ఇద్దరు, కొమిల్లాలో ఒకరు, జైపూర్‌హాట్‌లో ఒకరు, ఢాకాలో ఒకరు, బారిసాల్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దాంతో హోంమంత్రిత్వ శాఖ ఆదివారం సాయంత్రం దేశవ్యాప్తంగా కర్ఫ్యూను ప్రకటించింది. అలాగే, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మొబైల్ ఇంటర్‌నెట్ సేవలను సైతం నిలిపివేశారు. ఆదివారం అవామీ లీగ్ మద్దతుదారులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణల్లో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. షేక్ హసీనా తన వ్యక్తిగత నివాసం గణభబన్‌లో భద్రతా వ్యవహారాలపై జాతీయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరసనల పేరుతో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారు విద్యార్థులు కాదు ఉగ్రవాదులని.. గట్టి సమాధానం ఇవ్వాలని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్, సెక్యూరిటీకి సంబంధించిన ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని భద్రతా సలహాదారు కూడా ఉన్నారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గత కొద్దిరోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 200 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారు. శనివారం ప్రధాని షేక్ హసీనా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో సమావేశమయ్యారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను చర్చల కోసం తన ప్రైవేట్ నివాసానికి పిలిచారు. ఆందోళనకారులు ప్రధానితో ఎలాంటి చర్చలకు నిరాకరించారు. షేక్ హసీనా రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో వరుసగా రోడ్డు ప్రమాదాలు

మొదటి పేజీ తరువాయి...

చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోహిత్, జాబ్ సెర్చింగ్‌లో ఉన్న బాల ప్రసన్న తెల్లవారుజామున మసీద్ బండ నుంచి హాఫీజ్‌పేట్ వైపు బైక్‌పై వెళుతున్నారు. కొత్తగూడ ఫ్లైఓవర్‌పై అతి వేగంగా వెళ్తుండటంతో ఫ్లైఓవర్ గోడను ఢీకొని కింది పడ్డారు. ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కావడంతో హాస్పిటల్‌కు తరలిస్తుండగా.. చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో ప్రమాదంలో ఒక వ్యక్తి చనిపోయారు. తెల్లవారుజామున కేపీహెచ్బీ- హైటెక్ సిటీ మార్గంలో యశోద హాస్పిటల్ దగ్గర ఫ్లైఓవర్‌పై లారీ ఢీకొని స్వామి శంకర్ అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రవీణ్, స్వామి శంకర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా బైకు నడపటంతో.. లారీ ఢీకొట్టి బైక్ వెనుక కూర్చున్న స్వామి శంకర్ ఫ్లైఓవర్‌పై నుంచి కిందపడి మృతి చెందాడు. బైకు నడుపుతున్న ప్రవీణ్ తీవ్రస్థాయిలో గాయపడగా.. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఒక్కరోజే హైదరాబాద్ నగరంలో ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరిగి.. ఏడుగురు చనిపోవటం ఆందోళనకరం.

# ఈ నెల చివరి కల్లా రూ.24 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి...

శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే గువ్వలగూడెంలో రూ.10 లక్షల విలువ చేసే అంతర్గత సీసీ రోడ్లు, పల్లె దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఈ ఏడాది కురిసిన వర్షాలకు నదులు నిండటంతో కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. రైతన్నలు వ్యవసాయ సాగును విస్తారంగా సాగించి సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ నెల చివరి కల్లా రూ.24 వేల కోట్లతో ఇందిరమ్మ ఇల్లు : ప్రభుత్వ భూమిని పేదలకు పంచి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని, ఈ నెల చివరి కల్లా రూ.24 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం చేపడతామని పునరుద్ఘాటించారు. పేదలకు త్వరలోనే రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, నెల రోజుల వ్యవధిలోనే రూ.32 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిని రద్దు చేస్తామని చెప్పినట్లు వివరించిన మంత్రి, ఆ దిశగానే రద్దు చేసి మంచి సంస్కరణలతో భూసంస్కరణలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు కాకముందే ప్రతిపక్షాలు హస్తం పార్టీపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వారి నిర్ణయం మారడం లేదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడం కోసం శాసనసభలో అనేక గందరగోళాలు సృష్టించారని మంత్రి దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమ్య, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ ఛైర్మన్ శాఖమూరి రమేశ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# 'ఫోర్త్ సిటీ' పేరుతో కాంగ్రెస్ భూదందా

మొదటి పేజీ తరువాయి...

సిద్ధమయ్యారని అన్నారు. ధరణి పేరుతో దాదాపు రూ.2 లక్షల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. ధరణి స్కాం దేశంలోనే అతిపెద్దదని ఆయన పేరొన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తూ వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్రంగూడలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలకు బండి సంజయ్ పాల్గొన్నారు.

**బోనాల పండుగకు సైంటిఫిక్ రీజన్ ఉంది**

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "తెలంగాణ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు బోనాల పండుగ శుభాకాంక్షలు, బోనాల పండుగ వెనుక పెద్ద చరిత్ర ఉంది. బోనాల పండుగకు సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది. కానీ ఇంత పెద్ద పండుగకు ప్రభుత్వం నిధులివ్వదు. హిందువుల పండుగలకు పైసలివ్వరు. సెక్యులరిజం పేరుతో ఒక మతానికే కొమ్ముకాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. రంజాన్ కు రూ.33 కోట్లు, హిందువులను చంపిన తబ్లిగీ జమాతే సంస్థకు 2 కోట్ల 40 లక్షలు విడుదల చేసిన కాంగ్రెస్ అదేదో ఘన కార్యంగా చెప్పుకోవడం సిగ్గు చేటు.

హిందువుల పండుగలంటే అంత చులకనా? బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా ఎంఐఎం పార్టీకి కొమ్ము కాస్తోంది. ఈ విషయంపై మాట్లాడితే నాపై మతతత్వ ముద్ర వేయాలని చూస్తున్నారు. ఇట్లనే వ్యవహరిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ కు పట్టడం ఖాయం. ఎంఐఎం పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్ నేతలు నట్టేట మునగడం ఖాయం. 15 నిమిషాలపాటు సమయమిస్తే హిందువులను నరికి చంపుతానన్న అక్బరుద్దీన్ ఒవైసీని తీసుకెళ్లి కొడంగల్‌లో పోటీ చేయిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించడం సిగ్గు చేటు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు ఆలోచించాలి. నిరంతరం బీజేపీని విమర్శించడం మానుకోవాలి. తెలంగాణ అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం. కలిసికట్టుగా పనిచేసి నిధులు తీసుకొద్దాం. అంతే తప్ప ప్రధానమంత్రిని అదే పనిగా తిట్టడంవల్ల నష్టమే తప్ప లాభం లేదనే అంశాన్ని గుర్తుంచుకోవాలి" అన్నారు.

**రియల్ ఎస్టేట్ దందా**

మహేశ్వరం ను ఫోర్త్ సిటీగా మారుస్తామన్న కాంగ్రెస్ సర్కార్ ప్రకటన వెనుక పెద్ద భూదందా నడుస్తోందని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను అగ్గువకు కొని ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నరు. బీఆర్ఎస్ మాదిరిగానే భూదందాతో వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు ఫోర్త్ సిటీ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీనివల్ల కాంగ్రెస్ నేతలకు తప్ప ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదు పెద్ద ఎత్తున ఆస్తులు సంపాదించేందుకు భూ దందాను తెరపైకి తేవడమే కాకుండా మహేశ్వరం కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకుడికే భూములను సేకరించే బాధ్యతను అప్పగించారు. ఎన్నికల సమయంలో చెప్పిన రుణమాఫీ హామీ నెరవేర్చలేదు. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు. లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్య గత ప్రభుత్వ హయాంలోనే 36 లక్షల మంది ఉంటే లక్షన్నర లోపు రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 18 లక్షలు దాటకపోవడం గమనార్హం. అంటే నూటికి 70 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలే.. ఒకవైపు బ్యాంకుల్లో వడ్డీలు పెరిగి, బయట చేసిన అప్పులు తీరక, పెట్టుబడికి పైసల్లేక రైతులు అల్లాడుతుంటే ఈ ప్రభుత్వం మాత్రం గొప్పలు చెబుతోంది. రుణమాఫీతోపాటు 6 గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేసేందుకు కాంగ్రెస్ నేతలకు ఏదో ఒక కొత్త అంశాన్ని తెరపైకి తీసుకురావడం, ప్రజల ద్రుష్టిని మళ్లించడం అలవాటైపోయింది. రాబోయే స్థానిక సంస్థల్లో గెలిచేందుకు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. రుణమాఫీ సహా ఆరు గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులుసహా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీ పోరుబాటకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కార్యచరణ రడీ అవుతోంది. ధరణి పేరును భూమాతగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం....భూమాతను భూమేతకు ఉపయోగించుకునేందుకు రెడీ అవుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద స్కాం జరిగింది. తెలంగాణ ఏర్పడిన 2014 నాటికి రాష్ట్రంలో 24 లక్షల అసైన్డు భూములుంటే నేడు ఆ భూములు ఐదు లక్షలకు ఎలా తగ్గాయి. అసైన్డు భూములను, శిఖం భూములను, దేవాదయ, అటవీ, భూదాన భూములతోపాటు పేదల భూములను కూడా ధరణి పేరుతో బీఆర్ఎస్ లీడర్లు దండుకున్నరు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వివరాలెక్కడ ? వాటిని ఎందుకని రేవంత్ సర్కారు బయట పెట్టడం లేదని ఆరోపించారు. ఆ భూముల విలువ రెండు లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. కేసిఆర్ కుటుంబ సభ్యులు పెద్ధ ఎత్తున ధరణిని అడ్డుపెట్టుకుని దోచుకున్నారని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ధరణిపై ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక ఎటుపోయిందన్నారు. ఫోర్త్ సిటీ, భూమాత పేరుతో భూములను దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే భవిష్యత్తులో గజం భూమి కూడా మిగిలే పరిస్థితి కన్పించడం లేదు.

# స్నేహమేరా జీవితం..... స్నేహమేరా శాశ్వతం


స్నేహితులు


జర్నలిస్టు మిత్రులు


జర్నలిస్టు మిత్రులు

బుద్వేల్, ఆగస్టు4(ప్రభాత ఉదయం): స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జర్నలిస్టు మిత్రుల ఐక్యత గురించి చెప్పుకోవచ్చు. రాజేంద్రనగర్ లో జర్నలిస్టులందరు స్నేహమేరా జీవితం ....స్నేహమేరా శాశ్వతం ..అన్నట్లు కలిసి మెలిసి ఉంటారు. స్నేహితులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.


స్నేహితులు


జర్నలిస్టు మిత్రులు


ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలు

## సబితా ఇంద్రారెడ్డి, కార్తిక్ రెడ్డితో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

బుద్వేల్, ఆగస్టు4(ప్రభాత ఉదయం): ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావును ఆదివారం మాజీమంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి , తన కుమారుడు, యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ సభ్యులు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మీద చేసిన దాడి నేపథ్యంలో ఆమెతో మాట్లాడిన కేసీఆర్ ధైర్యంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం. సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్ రెడ్డితో కూడా భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడినట్లు సమాచారం. కార్తీక్ రెడ్డికి బీఆర్ఎస్ లో మంచి పదవి ఇచ్చి రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.


గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

## మార్కండేయ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రావుల నవీన్

బుద్వేల్, ఆగష్టు 4 (ప్రభాత ఉదయం): మైలార్ దేవ్ పల్లి డివిజన్ మార్కండేయ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను మార్కండేయ నగర్ నవోదయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీ అధ్యక్షులుగా రావుల నవీన్, ఉపధ్యక్షులుగా మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా మధు గౌడ్, సహాయ కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా చింటూ రెడ్డి, రాజు, శశిరాజ్, వెంకటేష్, విజయ్ యాదవ్, సాయి యాదవ్, శివ, బాలాజీ, కాల రాజు, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ, వీరాంజనేయ స్వామి దేవాలయం అసోసియేషన్ కమిటీ సమన్వయంతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు రావుల నవీన్ కుమార్ తెలిపారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన నవీన్ కుమార్ ను నవోదయ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.


ఏ ఐ ఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ప్రతినిధులు

## రాజేంద్రనగర్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం

బుద్వేల్, ఆగస్టు4(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయం (ఏ ఆర్ దేవరాజ్ భవన్) లో ఏఐఎస్ఎఫ్ నాయకుడు పి శివ అధ్యక్షతన ఆదివారం రంగారెడ్డి జిల్లా ఏ ఐ ఎస్ ఎఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా లోని అన్ని మండలా లలో సంఘం బలోపేతం కి కృషి చేయాలని తీర్మానం చేశారు. ఏ ప్రభుత్వాలు అయినా విద్యా రంగం గురించి ఆలోచించటం లేదని అన్నారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతాం అన్నారు.

### నూతన కౌన్సిల్ ఏర్పాటు

రంగారెడ్డి జిల్లా ఏ ఐ ఎస్ ఎఫ్ అధ్యక్షులు గా పవన్, కార్యదర్శి గా వంశీ, ఉపాధ్యక్షులు గా అరుణ్, పి వినోద్ , బి వినోద్, సహాయ కార్యదర్శులు గా శివ, భవానీ, శ్రీకాంత్,తేజ, కార్యవర్గ సభ్యులు గా ఆకాష్,సాయి, ఉపేందర్, నితేష్, కౌన్సిల్ సభ్యులుగా విజయ్, మణికంఠ, బన్నీ, రాహుల్ ,శివమణి, వంశీ, మేఘన, శివ, మొత్తం 21 మంది తో ఏకగ్రీవంగా ఎన్నుకోవ డం జరిగింది. వారందరూ జిల్లా లో అన్ని మండలాలకు సంఘ బలోపేతం కి కృషి చేస్తారని, విద్యార్థి ఉద్యమాలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్ పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బుద్వేల్ భక్తులు

## ఓడి బియ్యంతో అన్నదానం

బుద్వేల్, ఆగస్టు4(ప్రభాత ఉదయం): బుద్వేల్ బంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం ఓడి బియ్యం వండి అన్నదానం చేశారు. జూలై 28న జరిగిన బోనాల సందర్భంగా అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన ఓడి బియ్యంతో వంటచేసి భక్తులకు అన్నదానం చేశారు . ఈ కార్యక్రమంలో బుద్వేల్ కు చెందిన రజక సంఘం నాయకులు వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం బుద్వేల్ లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని రజక సంఘం నాయకులు తెలిపారు.



స్నేహితుల దినోత్సవ వేడుకల్లో శివరాంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో చదివిన 1993 ఎస్-ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు

## పదిలమైన పాత జ్ఞాపకాలు

### మురిపించిన ముప్పై ఏళ్ల ముచ్చట్లు

**సంబరంగా గడిపిన 1993 శివారంపల్లి ఉన్నత పాఠశాల స్నేహితులు**

రాజేంద్రనగర్,ఆగస్టు 04(ప్రభాత ఉదయం) ముప్పై ఏళ్ల కిందటి ముచ్చట్లు ఒక్కొక్కటిగా చెప్పుకుంటు మురిసిపోయారు...పాఠశాలలో జరిగిన పాత జ్ఞాపకాలు తరచి తరచి నెమరేసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి చదివిన 1993 బ్యాచ్ కు చెందిన స్నేహితులంతా ఒక్కచోట కలిసి శుభాకాంక్షలు తెలుపు కున్నారు.అనంతరం కేక్ కట్ చేసి,ఫ్రెండ్స్ బ్యాండ్లు ధరించి సంబరంగా గడిపారు. పాత,కొత్త సినీమా పాటలపై హుషారెత్తిన నృత్యాలతో అదరగొట్టారు. స్నేహితులంతా కలిసి భవిష్యత్తు కార్యచరణపై సమాలోచనలు చేశారు.ఈ కార్యక్రమంలో శీలం వెంకటేరెడ్డి. సంకూరి జయప్రకాష్,మహ్మద్ అసిఫ్, యూసుఫ్, చందు, సాయిబాబా,కిరణ్, వరలక్ష్మి, రజిత, భాగ్యలక్ష్మి, మంజుల, సరిత, డాక్టర్ ఆడికె కృష్ణ,భాస్కర చారి, చందు, కొమరయ్య, ధన్ రాజ్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


స్నేహితురాలుకు రాఖీ కడుతున్న 1993 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు


వేడుకల్లో 1993 బ్యాచ్ విద్యార్థులు

### శ్రావణ అమావాస్య సందర్భంగా

## కురుమూర్తి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


స్వామీ వారిని దర్శించుకుంట ఎన్న బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి

బుద్వేల్, ఆగస్టు4(ప్రభాత ఉదయం): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గం అమ్మాపూర్ గ్రామంలో గల చారిత్రాత్మక గురుమూర్తి వెంకటేశ్వర స్వామికి అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆదివారం తెల్లవారుజాము నుండే భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. పేదల వెంకటేశ్వర స్వామిగా కొలుచుకునే ఈ ప్రాంత ప్రజలు ఇష్టదైవమైన కురుమూర్తి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి, ప్రభాత ఉదయం దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి లు స్వామీ వారిని దర్శించుకున్నారు.


దేవరకద్ర సమీపంలోని అమ్మపల్లి వద్ద గల కురుమూర్తి వెంకటేశ్వర స్వామీ దేవాలయం

## రాంబాగ్ దుర్గామాత ఆలయంలో ఘనంగా ఆషాడ మాస చివరి అమావాస్య పూజలు

రాజేంద్రనగర్, ఆగస్ట్ 4(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాంబాబు దుర్గామాత ఆలయంలో ఆషాఢమాసము చివరి రోజు పురస్కరించుకొని ఘనంగా పూజలు చేశారు. ఆదివారం బిజెపి రాష్ట్ర నాయకురాలు, సంఘ సేవకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి రాంభాగ్ దుర్గామత మందిరములో అమ్మవారు శాకాంబరి అవతారములో భక్తులకు దర్శనమిచ్చి విశిష్టపూజలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలని ఉమామహేశ్వర్ రెడ్డి కోరుకున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో పవన్ పూజారి, అంజమ్మ, పుష్ప, నాగమణి, జయమ్మ,కవిత,శివాని, శమంత,శోభ,సంధ్య, తదితరులు పాల్గొన్నారు.







# పాతబస్తీలో ఘనంగా కావడి శోభ యాత్ర


కావడి యాత్ర ఊరేగింపులో భక్తులు


చార్మినార్ వద్ద కావడి యాత్రతో భక్తులు


కావడి యాత్ర ఊరేగింపులో భక్తులు

చార్మినార్, ఆగస్ట్ 4(ప్రభాత ఉదయం) హైదరాబాద్ పాతబస్తీలో ఆదివారం భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఇరవై ఏడవ భాగ్య కావడి శోభా యాత్ర జరిగింది. చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరం నుంచి ప్రారంభమైన శోభ యాత్ర కూకట్ పల్లిలోని శ్రీ ద్వాదశి జ్యోతిర్లింగం మందిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కావడి సంఘం ప్రతినిధులు మంగేరం అగర్వాల్. నరేంద్ర అగర్వాల్. పంకజ్ వర్మ తో పాటు పలువురు పాల్గొన్నారు.



## కవ్వ గూడలో ఘనంగా
# స్నేహితుల దినోత్సవ వేడుకలు
### సంబరాలు చేసుకున్న చిన్ననాటి స్నేహితులు

శంషాబాద్, ఆగస్టు 4( ప్రభాత ఉదయం) ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శంషాబాద్ మండలంలోని కవ్వగూడ గ్రామంలో చిన్ననాటి స్నేహితులందరూ ఒకచోట గుమి గుడి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని సంబరాలు చేసుకున్నారు. గ్రామ తాజా మాజీ ఉపసర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్. నరసింహ నేత. చందు. తదితర మిత్ర బృందం ఒకచోట సమావేశమై చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి హృదయాల ఆనందగీతం ఆలపిస్తూ సరదాగా గడిపారు. చాలా రోజుల తర్వాత ఒకచోట సమావేశమైన మిత్రులు మధురానుభూతులను మనసు విప్పి మాట్లాడుకున్నారు.



## ఎనిమిదవ వార్డు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన తోకల మురళీకృష్ణ యాదవ్

శంషాబాద్ ఆగస్టు 4(ప్రభాత ఉదయం ) ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇస్తుందని శంషాబాద్ పురపాలక సంఘం యువ నాయకులు తోకల మురళీకృష్ణ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద మంచూరియా అయినా చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, 8వ వార్డు కౌన్సిలర్ తోకల విజయలక్ష్మి సమక్షంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేయడం జరిగింది..అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న,పి మౌనిక యాదవ్ 21000. ,సెవెళ్ల జగన్నాథంకు 26500 లిరూపాయిలు,ఎహ్. కృష్ణ, 36500,రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు తోకల మురళీకృష్ణ, మాట్లాడు తు లబ్ధిదారులు ప్రభుత్వపరంగా వచ్చే ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు కౌన్సిలర్ విజయలక్ష్మి కి యువ నాయకులు తోకల. మురళి కృష్ణ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


పెద్ద చింతరేవుల ఆలయంలో భక్తుల సందడి

# ఆలయాల్లో అమావాస్య పూజలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4(ప్రభాత ఉదయం)ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ధరూర్ మండలం పెద్ద చింతరేవులలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, మల్దకల్ శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం, పాగుంటా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామీ, బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడింది. అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పెద్ద చింతరేవుల శ్రీఅంజనేయస్వామి, పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాలకు కర్ణాటక ఆంధ్ర తెలంగాణ భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.



## మెరుగైన వైద్యాన్ని అందించడం కోసమే
# సీఎం రిలీఫ్ ఫండ్ పథకం
### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, ఆగస్టు 4(ప్రభాత ఉదయం ) ఆపదలో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశపెట్టి అందరికీ అండగా నిలుస్తున్నదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డులకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆదివారం ,12,50,000 , రూపాయల సీఎం సహాయనిధి చెక్కులు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందరికీ అండగా నిలుస్తున్నదని తెలిపారు. అర్హులైన వారందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకాష్ గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్ , కౌన్సిలర్లు చెన్నం అశోక్ , వై కుమార్ , జాంగిర్ ఖాన్. తోకల మురళి యాదవ్ , పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. కొనమోల శ్రీనివాస్ , సురేష్ గౌడ్ , జ్ఞానేశ్వర్ యాదవ్ , అజార్ , చందు. ,బంటి , విజయ్ గౌడ్ , మనోహర్ గౌడ్. మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమారీని మర్యాద పూర్వకంగా కలిసిన మంద కృష్ణ మాదిగ



## యాచిస్తే కాదు పోరాడితేనే
# రెండు పడక గదుల ఇళ్ళు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4(ప్రభాత ఉదయం)యాచిస్తే రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయరని తిరగబడి పోరాడితేనే రెండు పడక గదుల ఇళ్లను సాధించుకోగలమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని పలు వార్డులలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సర్వే నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులు జిల్లా అధికారులు స్థానిక ప్రజాప్రతినిదులపై నమ్మకం ఉంచి లబ్ధిదారులు సహనంతో వేచి చూశారని అధికారులు ప్రజాప్రతినిదుల కార్యాలయాలు ఇళ్ల చుట్టూ ప్రదక్షణలు చేసిన వారికి కనికరం రాలేదన్నారు. కార్యాలయాలు ఇళ్ల చుట్టూ తిరగకుండా తిరగబడి పోరాడి పేదలు తమ డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు,కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగే కొద్ది స్థలాల కొనలేక ఇండ్లను నిర్మించుకోలేక పేదలు ఎన్ని ఇబ్బందులకు గురి అవుతారో స్థానిక ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం లబ్ధిదారుల వైపు నుంచి కూడా మానవతా దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. లబ్ధిదారులు అనుభవిస్తున్న బాధలను చూసి కూడా అధికారులు స్థానిక ప్రజాప్రతినిదుల మనసు కరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు లబ్ధిదారులు తమ ప్రతిఘటన పోరాటాల ద్వారానే ఇల్లు సాధించుకోగలుగుతారని అన్నారు. రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేయకపోడానికి గల కారణాలు ఏంటో లబ్ధిదారులకు బహిరంగంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. 1300 కుటుంబాలు 5200 మంది వ్యక్తుల జీవితాలను పణంగా పెట్టి పాలకులు అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య బాధ్యతరాహిత్యానికి లబ్ధిదారులు ఐక్యంగా ఉండి రెండు పడక గదులు సాధించుకోవాలని అన్నారు. లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్లను పంపిణీ చేసేంతవరకు వారి ముందుండి చివరి వరకు సిపిఎం పార్టీ ఉద్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ ఎల్లప్ప,రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# నదీ తీరాన సందర్శకుల సందడి







గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4(ప్రభాత ఉదయం)ఆదివారం సెలవు రోజు కావడంతో కృష్ణ నదీ తీరాన వెంబడి కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానది పరిధిలో ఉన్న ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. ఆల్మట్టి డ్యామ్, నారాయణపూర్ డ్యాం ప్రాజెక్టుల నుంచి గేట్లు తెరిచి జూరాల ప్రాజెక్టు కు నీరు వదులుతున్నారు. ప్రాజెక్టు నిండటంతో అధికారులు 34 గేట్లు తెరిచి శ్రీశైలం ప్రాజెక్టుకు నీళ్లు వదులుతున్నారు. అయితే ఆదివారం సెలవు కావడంతో సందర్శకులు భారీగా వచ్చారు. దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ పరవళ్లను చూసి పరవశించిపోయారు. దీంతో సందర్శకులతో జూరాల ప్రాజెక్టు వద్ద, గద్వాల జిల్లాలో ప్రవహించు కృష్ణానదీ తీరాన సందర్శకుల సందడి కనిపించింది. జూరాల, రేకులపల్లి, నదీ అగ్రహారం, బీచుపల్లి మీదుగా ఉ ధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ అందాలను సందర్శకులు తమ సెల్ ఫోన్ లో బందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టు వద్ద సందడి చేశారు. చిన్నారులు, యువకులు ఫొటోలు తీసుకుంటూ బిజీగా గడిపారు. సందర్శకులు నదీస్నానం చేస్తూ సేద తీరారు. అనంతరం పర్యాటకులు నదీ తీరం వెంబడిగల ప్రముఖ ఆలయాలను దర్శించుకున్నారు.

### కృష్ణమ్మకు మంగళహారతులు

గద్వాల మున్సిపాలిటి పరిధిలోని నదీ అగ్రహారం పుష్కర ఘాట్ వద్ద అర్చకులు కృష్ణమ్మకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమవాస్య గడియలు రావడంతో సంప్రదాయం ప్రకారం పుణ్యనదీ హారతి, జ్వాలా తోరణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కృష్ణమ్మ పూజలో పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.